ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



పెద్దపల్లి

జిల్లా వార్తలు


5★

సోమవారం 12 ఫిబ్రవరి 2024

బొగ్గు ఉత్పత్తి లక్ష్య సాధనకు కృషి చేయాలి 8లో..

సమ్మెకు మద్దతుగా ఇఫ్టూ బైక్ ర్యాలీ 8లో..

ముంపు బాధ తొలగేదెన్నడో?



కాళేశ్వరం బ్యాక్ వాటర్‌తో నీట మునిగిన పొలం(ఫైల్)

- కాళేశ్వరం బ్యాక్‌వాటర్‌తో మునుగుతున్న పొలాలు
- 630 ఎకరాలకు పైగా మునక.. పట్టించుకోని గత ప్రభుత్వం
- భూసేకరణ చేయక ప్రతి ఏడాది నష్టపోతున్న రైతులు
- కొత్త ప్రభుత్వంపై ఆశలు

పెద్దపల్లి, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వ హయాంలో నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టు పలువురు రైతులకు శాపంగా మారింది. జిల్లాలోని మంథని, మంచిర్యాల జిల్లా చెన్నూరు నియోజకవర్గానికి చెందిన రైతుల పంట పొలాలు కాళేశ్వరం ప్రాజెక్టు బ్యాక్ వాటర్‌తో వందలాది ఎకరాల భూములు ముంపునకు గురై రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. తమ భూములను భూసేకరణ కింద సేకరించి నష్టపరిహారం ఇవ్వాలని మూడేళ్లుగా రైతులు పోరాడుతున్నా గత ప్రభుత్వం పట్టించుకోలేదు. సంబంధిత శాఖాధికారులు సర్వే చేసి భూసేకరణకు కావాల్సిన నిధుల కోసం ప్రభుత్వానికి నివేదికలు సమర్పించినా కూడా స్పందించ లేదు. పెద్దపల్లి జిల్లాలోనే సుమారు 330 ఎకరాలకు పైగా నీట మునుగుతున్నాయి. చెన్నూరు ప్రాంతంలో కూడా 300 ఎకరాలకు పైగా ముంపునకు గురవుతున్నాయి. ప్రాజెక్టు నిర్మాణానికి వేల కోట్ల రూపాయలు వెచ్చించిన గత ప్రభుత్వం భూసేకరణ కోసం సుమారు 150 కోట్ల రూపాయల వరకు విడుదల చేయలేక చేతులెత్తేసింది. క్రాప్ హాలీడే కింద కూడా సక్రమంగా పరిహారం ఇవ్వకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. బీఆర్ఎస్ పోయి కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో రైతులు ఆశలు పెంచుకున్నారు.



మంథని మండలం ఆరెంద పంచాయతీలో సర్వేకు వచ్చిన ఏఈఓని నిర్బంధించిన రైతులు(ఫైల్)

కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో భాగంగా గోదావరి నదిపై అన్నారం వద్ద సరస్వతి, సుందిళ్ల వద్ద పార్వతి బ్యారేజీలను నాటి ప్రభుత్వం నిర్మించింది. మూడేళ్ల నుంచి బ్యాక్ వాటర్‌తో ఆయా గ్రామాల్లోని భూములు ముంపునకు గురవుతున్నాయి. ఆ భూములను భూ సేకరణ కింద నోటిఫై చేసినప్పటికీ ఇప్పటివరకు పరిహారం సొమ్మును విడదల చేయకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. కేవలం అన్నారం బ్యారేజీ బ్యాక్ వాటర్‌తో మంథని మండలంలోని ఆరెంద గ్రామంలో ముంపునకు గురవుతున్న 152.34 ఎకరాల భూములకు మాత్రమే 2022 జన వరిలో 9కోట్ల 55లక్షల 80వేల 543రూపాయలు విడుదలయ్యాయి. అలాగే ఈ భూములే కాకుండా మంథని మండలం అమ్మగారిపల్లి, కాసిపేట, ఖానాపూర్, ఖాన్‌సాయిపేటలో 87.38 ఎకరాలు సేకరించారు. మంథనిలో 38.38 ఎకరాలు, ఆరెంద, మల్లారం, వెంకటాపూర్‌లో 40 ఎకరాల భూములు సరస్వతి(అన్నారం) బ్యారేజీ బ్యాక్‌వాటర్‌తో ముంపునకు గురవుతున్నాయి. పార్వతి(సుందిళ్ల) బ్యారేజీ బ్యాక్ వాటర్‌తో సుందిళ్ల, సిరిపురం, ముస్త్యాల, జల్లారం గ్రామాల భూములు 52.19 ఎకరాలు, జనగామ గ్రామానికి చెందిన 199.30 ఎకరాల భూములు ముంపునకు గురవుతున్నట్లు రెవెన్యూ శాఖాధికారులు గుర్తించారు. ఈ భూములన్నింటినీ భూసేకరణ చట్టం కింద సేకరించి మార్కెట్ విలువలకు అనుగుణంగా పరిహారం సొమ్ము ఇవ్వాలని రైతులు పలుసార్లు ధర్నాలు, రాస్తారోకోలు చేశారు. కలెక్టర్, ప్రభుత్వానికి పలుమార్లు వినతిపత్రాలు కూడా అందజేశారు. ఈమేరకు ప్రభుత్వం భూసేకరణకు నోటిఫికేషన్ కూడా జారీ చేసింది. భూములు కోల్పోతున్న రైతుల అభిప్రాయాలను తీసుకున్నారు. నష్టపరిహారం సొమ్ము కోసం ప్రభుత్వానికి ఏడాదిన్నర క్రితమే జిల్లా అధికారులు లేఖలు రాశారు. ప్రభుత్వం డబ్బులు విడుదల చేసి అవార్డు ప్రకటించకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

కాళేశ్వరం ప్రాజెక్టులో నిర్మించిన సరస్వతి, పార్వతి బ్యారేజీల నిర్మాణాలు 2019లో పూర్తికాగా, గోదావరి తీరం వెంబడి ఉన్న భూములు బ్యాక్‌వాటర్‌తో ముంపునకు గురవుతున్నాయి. నాలుగేళ్లుగా రెండు సీజన్లలో వేస్తున్న పంటలు నీట మునుగుతుండడంతో రైతులు నష్టపోతున్నారు. పంటలకు ఆరెంద, మల్లారం, అమ్మగారిపల్లి, ఖాన్‌సాయిపేట గ్రామాలకు చెందిన రైతులకు ఎకరానికి 19వేల రూపాయల చొప్పున నష్టపరిహారం ఇస్తూ వచ్చారు. 2021 వానాకాలం, యాసంగి సీజన్లకు సంబంధించి గత ఏడాది జనవరిలో ఆరెందలో 258.17 ఎకరాలు, మల్లారంలో 116.18 ఎకరాల భూములకు, ఖాన్‌సాయిపేటలో 34.36 ఎకరాలు, అమ్మగారిపల్లెలో 78.18 ఎకరాల భూములకు పంట నష్టపరిహారం ఇస్తున్నారు. గడిచిన వర్షాకాలం సీజన్‌కు సంబంధించిన పంట నష్టపరిహారం సొమ్ము ప్రభుత్వం నుంచి ఇంకా రావాల్సి ఉందని రైతులు తెలిపారు. గడిచిన రెండేళ్లలో కురిసిన భారీ వర్షాలకు గోదావరి నదికి పెద్దఎత్తున 9 నుంచి 11లక్షల క్యూసెక్కుల వరద నీరు రావడంతో తీర ప్రాంతాల గ్రామాల భూములతో పాటు వాగుల్లోకి బ్యాక్‌వాటర్ రావడంతో ఉప్పట్ల, సిరిపురం, విలోచవరం గ్రామాల్లోని భూములు కూడా ముంపునకు గురయ్యాయి. గత ప్రభుత్వ హయాంలో అధికారులకు, ప్రభుత్వానికి ఎన్నోసార్లు విన్నవించినా ఫలితం లేకుండా పోయింది. కొత్తగా అధికారంలోకి కాంగ్రెస్ ప్రభుత్వం రావడంతో రైతులు ఆశలు పెంచుకున్నారు. మంథని ఎమ్మెల్యే దుద్దిళ్ల శ్రీధర్‌బాబు రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రిగా కొనసాగుతున్నారు. ప్రభుత్వంపై ఒత్తిడి పెంచి ముంపునకు గురవుతున్న తమ భూములను సేకరించి పరిహారం ఇప్పించాలని రైతులు మంత్రిని కోరుతున్నారు.

గత ప్రభుత్వం రైతులను నిర్లక్ష్యం చేసింది..

- ఎం సత్యనారాయణ, మల్లారం



మల్లారం గ్రామానికి చెందిన నాకు మూడు ఎకరాల భూమి ఉంది. కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా అన్నారం బ్యారేజీ నిర్మించినప్పటి నుంచి బ్యాక్ వాటర్‌తో పంటలు మునుగుతున్నాయి. మా భూములను సేకరించి పరిహారం ఇవ్వాలని గత ప్రభుత్వ హయాంలో పలుసార్లు అధికారులకు విన్నవించినప్పటికీ అప్పటి ప్రభుత్వం రైతులను నిర్లక్ష్యం చేసింది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో రైతుల్లో ఆశలు రేకెత్తుతున్నాయి. ప్రభుత్వం వెంటనే స్పందించి మా భూములను సేకరించి పరిహారం చెల్లించాలి.

టీఎస్‌టీపీపీ రెండో యూనిట్ ట్రయల్ ఆపరేషన్ సక్సెస్

జ్యోతినగర్, ఫిబ్రవరి 11 : ఎన్టీపీసీకి చెందిన తెలంగాణ సూపర్ థర్మల్ పవర్ ప్రాజెక్టు(టీఎస్‌టీపీపీ) స్టేజ్-1 పూర్తి సామర్థ్యానికి చేరుకుంది. 800 మెగావాట్ల 2వ యూనిట్‌కు ఆదివారం నిర్వహించిన ట్రయల్ ఆపరేషన్ సక్సెస్ అయింది. ఈ యూనిట్ పూర్తిస్థాయి ఉత్పత్తి దశకు చేరుకోవడంతో మొత్తం 1600 మెగావాట్ల(800 మెగావాట్ల 2యూనిట్లు) మొద టి దశ సంపూర్ణమైంది. పాజెక్టులోని 800మెగావాట్ల 2వ యూనిట్‌కు నిర్వహించిన ట్రయల్ ఆపరేషన్ ఆదివారం ఉదయం 11.02 గంటలకు విజయవంతంగా పూర్తయింది. గత గురువారం యూనిట్‌కు సంబంధించి ట్రయల్ ఆపరేషన్ ప్రారంభించారు. 72గంటలపాటు కొనసాగిన ట్రయల్ ఆపరేషన్ గ్రాండ్ సక్సెస్ అయ్యింది. 2వ యూనిట్లో 800 మెగావాట్లకు పైగా లోడ్‌తో ఉత్పత్తి కొనసాగింది. ట్రయల్ ఆపరేషన్ చివరి దశను ప్రాజెక్టు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కేదార్ రంజన్ పాండు వివిధ విభాగాల జీఎంలు జీజీ.సురేష్, సంజీవ్‌సాహ, సంతోష్ తివారి, మోహన్‌రెడ్డి, అలోక్‌కుమార్ త్రిపాఠి, రవింద్ర పటేల్, కేసి.సింగ రాయ్, మేముల అనిల్ కుమార్, ఏజీఎం(హెచ్‌ఆర్) సిక్దర్, ఇతర ఉన్నతాధికారులు పర్యవేక్షించారు. ట్రయల్ ఆపరేషన్ పూర్తవడంతో మరో రెండు, మూడు రోజుల్లో 2వ యూనిట్‌ను కమిర్షియల్ ఆపరేషన్‌గా(సీవోడీ) ప్రకటించేందుకు అధికారులు ప్రయత్నిస్తున్నారు. కాగా, యూనిట్ ఫుల్ సామర్థ్యంతో ట్రయల్ ఆపరేషన్ విజయవంతం కావడంతో ఈడీ కేదార్ రంజన్ తెలంగాణ సూపర్ థర్మల్ పవర్ ప్రాజెక్టు అధికారులు, సిబ్బందిని అభినందించారు. ఈ సందర్భంగా స్వీట్లు పంపిణీ చేసి ఆనందాన్ని పంచుకున్నారు. నాలుగునెలల క్రితం 800 మెగావాట్ల 1వ యూనిట్‌ను సీవోడీ ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ ప్రాజెక్టు నుంచి 85 శాతం విద్యుత్ తెలంగాణ రాష్ట్రానికే సరఫరా చేస్తారు. రెండో దశలో 2400 మెగావాట్ల ప్రాజెక్టును నెలకొల్పాల్సి ఉంది.



తెలంగాణ సూపర్ థర్మల్ పవర్ ప్రాజెక్టు



అధికారులతో ఎన్టీపీసీ ఈడీ కేదార్ రంజన్ పాండు

● సుదీర్ఘ కాలం తరువాత..

అనేక సవాళ్లు, అవాంతరాల తరువాత తెలంగాణ సూపర్ థర్మల్ ప్రాజెక్టు పూర్తయింది. ఏపీ పునర్విభజన చట్టం ప్రకారం 4000 మెగావాట్ల ప్రాజెక్టును ఎన్టీపీసీ ఆధ్వర్యంలో నెలకొల్పాలని పేర్కొన్న విషయం తెలిసిందే. దీనిలో భాగంగా 2016లో పునాదిరాయిపడిన స్టేజ్-1 మొదట్లో వేగంగా నిర్మాణ పనులు జరిగినా కరోనా, సాంకేతిక కారణావల్ల తీవ్ర జాప్యమైంది. 2020-21లోనే ప్రాజెక్టులోని మొదటి, రెండవ యూనిట్లను పూర్తిచేయాలని ప్రణాళికలు రూపొందించినప్పటికీ కరోనా, సాంకేతిక సమస్యలు రావడంతో నిర్మాణ పనులు ఆలస్యమయ్యాయి.

గత ఏడాదిన్నర కాలంగా ప్రాజెక్టు నిర్మాణ పనులను వేగంగా చేయడం ద్వారా స్టేజ్-1లో రెండు యూనిట్లు ఉత్పత్తి దశకు చేరాయి. 800 మెగావాట్ల 1వ యూనిట్‌ను గత ఏడాది అక్టోబరు 3న ప్రధాని నరేంద్ర మోదీ జాతికి అంకితం చేశారు. రెండో యూనిట్ ఆదివారం ట్రయల్ ఆపరేషన్ విజయవంతంగా పూర్తి చేసుకొని కమర్షియల్ ఆపరేషన్ డిక్లరేషన్‌కు సిద్ధమైంది.

గౌరెడ్డిపేట ఇటుక బట్టీల్లో వైద్య శిబిరం

- పరిసరాల్లో పారిశుధ్య చర్యలు
- మరో 33 మంది ఆసుపత్రుల్లో చికిత్స

పెద్దపల్లి రూరల్, ఫిబ్రవరి 11 : పెద్దపల్లి మండలంలోని ఇటుక బట్టీల్లో పనిచేసేందుకు వచ్చిన వలస కార్మికులు ఇద్దరు మృతిచెందిన సంఘటన జిల్లాలో సంచలనంగా మారింది. వారు తిన్న ఆహారంతో మృతిచెందారా లేక ఇటుక బట్టీల్లో అపరిశుభ్రత వల్ల ఘటన చోటు చేసుకుందా అనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. కార్మికులు తాగునీటి కోసం బట్టీలో ఏర్పాటు చేసిన బోర్ వెల్ వినియోగిస్తున్నారు. దీంతో తాగునీటి వల్ల జరిగిందనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.గౌరెడ్డిపేట ఇటుక బట్టీలో ఫుడ్ పాయిజన్ అయిందని వదంతాలు వస్తున్నా అధికారులు మాత్రం ఇటుక బట్టీలో ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం గమనార్హం. ఇప్పటికే ఇటుక బట్టీలో 35మంది కార్మికులు ఫుడ్ పాయిజన్ అయి ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారు. మరో 33 మంది వలస కార్మికులు కరీంనగర్, పెద్దపల్లి ప్రయివేట్, ప్రభు త్వ ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారు. అయితే వారిని పట్టించుకునే వారే కరువయ్యారు. ఇద్దరు కార్మికులు మృతిచెందాక ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు బట్టీలో ప్రత్యేక హెల్త్ క్యాంపులు ఏర్పాటు చేశారు. అయితే వలస వచ్చిన కార్మికుల పట్ల వైద్య, కార్మిక, రెవెన్యూ అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాల్సిన అవసరం ఉన్నా కార్మికులపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపణలున్నాయి. ఇటుక బట్టీల్లో కార్మికులకు కనీస వసతులు కల్పించాలని ఉన్నతాధికారుల ఆదేశాలున్నా వసతులు కానరాని పరిస్థితి. కనీసం కార్మికులకు మరుగుదొడ్లు, తాగునీరు, ఉండేందుకు గదులు కూడా సరిగా లేకపోగా దోమలు, ఈగల మధ్య దుర్భర జీవితాన్ని గడుపుతున్నారు. ఇద్దరు కార్మికులు మృతిచెందిన సంఘటన వెలుగులోకి రావడంతో ఇటుక బట్టీల్లో పరిసరాలన్ని బ్లీచింగ్ చేయించే పనిలో యజమన్యాలు నిమగ్నం అయ్యాయి.



ఇటుక బట్టీల వద్ద ఏర్పాటు చేసిన వైద్య శిబిరం



కార్మికులను పరామర్శిస్తున్న బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు రాజనర్సయ్య

● శానిటేషన్ చర్యలు..

అపరిశుభ్రత వాతావరణం, కార్మికులు ఉండే ప్రాంతం పూర్తిగా అపరిశుభ్రత వాతావరణం ఉండగా ఇద్దరు వలస కార్మికులు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందడంతో ఇటుక బట్టీ యజమాన్యాలు పరిసరాలను శుభ్రం చేసే పనిలో పడ్డారు. కార్మికులపై చిన్నచూపు చూడటంతో పాటు పలు మార్లు వేధింపులకు గురిచేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఇద్దరు మృతిచెందడంతో అలర్ట్ అయిన యజమాన్యాలు బట్టీలకు పలు శాఖల అధికారులు వస్తారని ఆలోచనతో బట్టీల్లో పూర్తి బ్లీచింగ్ పౌడర్ వేసి శుభ్రం చేస్తున్నారు. కార్మికులకు కనీసం మరుగుదొడ్లు లేకపోవడంతో బహిరంగ మలవిసర్జన వల్ల రోగాలు వస్తాయని వైద్య అధికారులు పేర్కొంటున్నా కూడా కార్మికులకు కనీసం అవగాహన కల్పించని పరిస్థితి నెలకొని ఉంది.

● బట్టీలో హెల్త్ క్యాంపు..

మండలంలోని గౌరెడ్డిపేట ఎంఎస్ఆర్ ఇటుక బట్టీల్లో విషాహారం తినడం వల్ల ఇద్దరు కార్మికులు మృతిచెందగా, జిల్లా వైద్యాధికారి ప్రమోద్‌కుమార్ ఆదేశాల మేరకు ఆదివారం బట్టీలో హెల్త్ క్యాంపు నిర్వహించారు. ఈసందర్భంగా 72 మంది కార్మికులను వైద్యులు పరీక్షించి ఏవైనా సమస్యలు ఉంటే అడిగి తెలుసుకున్నారు. హెల్త్ క్యాంపులో వైద్యరాలు సింధూష, హెచ్‌ఈవో సాంబయ్య, సిబ్బంది విమల, మధులత, జ్యోతి, ఆశా కార్యకర్తలు ఉన్నారు.

వలస కార్మికులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి

పెద్దపల్లి జిల్లాకు పలు రాష్ట్రాల నుంచి బతుకు దెరువు కోసం వచ్చిన కార్మికులపై అధికారులు, యజమాన్యాలు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు రాజనర్సయ్య అన్నారు. ఆదివారం పెద్దపల్లి మండలంలోని గౌరెడ్డిపేట ఇటుక బట్టీలో ఆహారం వికటించి ఇద్దరు మృతిచెందగా కొంతమంది పెద్దపల్లి ప్రభుతాసుపత్రిలో చికిత్స పొందుతుండటంతో వారిని పరామ ర్శించారు. అనంతరం కార్మికుల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. బతుకు దెరువు కోసం వచ్చిన కార్మికులను కాపాడుకోవాల్సిన బాధ్యత యజమాన్యాలపై ఉందని పేర్కొన్నారు. కార్మికులకు ఆసుపత్రుల్లో మెరుగైనా వైద్యం అందించాలని వైద్యులను కోరారు. వారి వెంట నాయకులు బొంకూరి సాగర్, సాతూరి అనిల్, బొంకూరి అన్వేష్, గాజుల సృజిత్ పాల్గొన్నారు.

మల్లన్న జాతరలో భక్తుల పూజలు



ఆలయంలో పట్నాలు వేస్తున్న ఒగ్గు పూజారులు

ఓదెల, ఫిబ్రవరి 11 : జిల్లాలో ప్రసిద్ధి చెందిన శైవక్షేత్రం శ్రీభ్రమరాంబ మల్లికార్జున స్వామి జాతరకు ఆదివారం వేలాది మంది భక్తులు తరలివచ్చి పూజలు నిర్వహించారు. సమ్మక్క-సారలమ్మ జాతరకు వెళ్లే భక్తులంతా ముందుగా మల్లన్న జాతరకు వచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. సిద్దిపేట్ జిల్లా హుస్నాబాద్, కరీంనగర్, వరంగల్ తదితర జిల్లాల నుంచి జాతరకు అధిక సంఖ్యలో వచ్చిన భక్తులు మల్లన్నకు బోనాలు, పట్నాలు, కోడే మొక్కులను సమర్పించారు. అలాగే భక్తులు మదన పోచమ్మ, బంగారు పోచమ్మలను దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. మల్లన్న, రాములవారిని దర్శించుకోవడానికి భక్తులకు మూడు గంటల సమయం పట్టింది. జాతరకు దాదాపు 10వేల మంది భక్తులు హాజరయ్యారు.

క్రీడాకారులకు ప్రోత్సాహం అందిస్తా..

- ఎమ్మెల్యే విజయరమణారావు



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎమ్మెల్యే విజయరమణారావు

సుల్తానాబాద్, ఫిబ్రవరి 11: క్రీడాకారులకు ఎల్లవేళలా ప్రోత్సాహం అందిస్తానని ఎమ్మెల్యే విజయరమణారావు తెలిపారు. మండలంలోని ఐతరాజుపల్లి గ్రామంలో ఉమ్మడి కరీంనగర్ జిల్లాస్థాయి వాలీబాల్ క్రీడాపోటీలను ఆయన ఆదివారం పరిశీలించారు. అంతకుముందు పోటీల్లో పాల్గొనేందుకు వచ్చిన 36 జట్ల క్రీడాకారులను ఆయన పరిచయం చేసుకున్నారు. అనంతరం ఏర్పాటుచేసిన సమావేశంలో ఎమ్మెల్యే విజయరమణారావు మాట్లాడుతూ క్రీడాకారులకు తన సహాయసహకారాలు ఎల్లవేళలా ఉంటాయన్నారు. వాలీబాల్ అసోసియేషన్ వారి ఆధ్వర్యంలో ఈ పోటీలు నిర్వహిస్తున్నారు. నిర్వాహకులు ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో నాయకులు మినుపాల ప్రకాష్ రావు, సాయిరి మహేందర్, దామోదర్ రావు, చిలుక సతీష్ తదితరులు పాల్గొన్నారు.

ఆధార్ కార్డుపై ఏపీ ఉంటే చెల్లదట..

మహాలక్ష్మి ఉచిత బస్సు ప్రయాణంలో కొర్రీలు

కళ్యాణ్‌నగర్, ఫిబ్రవరి 11: ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహాలక్ష్మి ఉచిత బస్సు ప్రయాణంలో కండక్టర్లు కొర్రీలు పెడుతున్నారు. ఆధార్‌కార్డుపై ఏపీ ఉంటే చెల్లదంటూ దబాయిస్తుండడంతో బస్సుల్లో గొడవలు మొదలవుతున్నాయి. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఆధార్‌కార్డులు జారీ చేసినప్పుడు దానిపై ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అని ఉండడంతో బస్సుల్లో మహిళలు ఆధార్ కార్డు చూపెట్టినప్పుడు ఇది చెల్లదంటూ కండక్టర్లు పేర్కొనడంతో టికెట్ తీసుకుని ప్రయాణిస్తున్నారు. కొంత మంది కండక్టర్లు మధ్యలోనే మహిళలను దింపేస్తున్నారు. ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ఈ పథకంలో కండక్టర్లు ఏదో ఒక సాకు చూపి మహిళలను ఇబ్బంది పెడుతున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. అంతేకాకుండా కొన్ని రూట్లలో స్టేజీల వద్ద బస్సులను ఆపకుండా వెళ్లిపోతున్నారు. ఆధార్ కార్డులో తెలంగాణ అని మార్చుకోవడానికి ఆధార్ సెంటర్లు మహిళలు తిరుగుతున్నారు. ఉదయం 5గంటలకే ఆధార్ సెంటర్‌ల వద్ద క్యూలు కడుతున్నారు. కొంతమంది కండక్టర్లు అనుమతిస్తున్నప్పటికీ కొంతమంది ఇబ్బందులకు గురిచేస్తున్నారని మహిళలు వాపోతున్నారు.

గంగపుత్రుల హక్కులు కాపాడుతాం

- ఎమ్మెల్సీ తాటిపర్తి జీవన్‌రెడ్డి

జగిత్యాల, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): గంగ పుత్రుల హక్కులు కాపాడడానికి అనవరమైన కృషి చేస్తానని ఎమ్మెల్సీ తాటిపర్తి జీవన్‌రెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలో జరిగిన గంగపుత్రుల మహాసభకు ముఖ్య అతిథిగా ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గంగపుత్రులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడంతో పాటు కుల సంఘ భవన నిర్మాణాలకు నిధులు మంజూరు చేస్తానన్నారు. చెరువులు, కుంటలపై కేవలం గంగపుత్రులకు మాత్రమే హక్కు ఉంటుందన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో కాంగ్రెస్ పాలనలో గీచే వాడిదే చెట్టు అని హక్కు కల్పించామని, చేపలు పట్టే వారికే చెరువులు, కుంటలపై గంగపుత్రులు, మత్స్య కార్మికులకు హక్కులు ఉండాలన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ఫిషరీస్ సెల్ అధ్యక్షుడు మిట్ల సాయికుమార్, పలువురు గంగపుత్ర సంఘం నాయకులు, సభ్యులు పాల్గొన్నారు.

యువకుడి ఆత్మహత్య

జగిత్యాల, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రాంబజార్ కాలనీకి చెందిన మంతెన అక్షయ్ (27) అనే యువకుడు ఆదివారం ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అక్షయ్ కొంత కాలంగా మద్యానికి బానిసయ్యాడు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. సంఘటన స్థలాన్ని పోలీసులు సందర్శించి పరిశీలన జరిపారు. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబసభ్యులకు అప్పగించారు. సంఘటనపై ఎస్ఐ మన్మథరావు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ నటేశ్ గౌడ్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి

మానకొండూర్, ఫిబ్రవరి 11: మండలంలోని శంషాబాద్ గ్రామ శివారులో ఆదివారం తెల్లవారు జామున జరిగిన రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. కరీంనగర్-వరంగల్ ప్రధాన రహదారిపై గుర్తు తెలయని వాహనం ఢీకొన్న ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడని గ్రామపంచాయితీ సిబ్బంది ఎండీ హకీం ఫిర్యాదు మేరకు మృతదేహాన్ని కరీంనగర్ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ రాజ్‌కుమార్ తెలిపారు.

కారు ఢీకొని ఒకరు..

ఎండపల్లి, ఫిబ్రవరి 11: రోడ్డు పక్క నుంచి నడుచుకుంటూ వెళ్తున్న వ్యక్తిని కారు ఢీ కొట్టడంతో మండలంలోని కొత్తపేట గ్రామానికి చెందిన బోగ లచ్చయ్య(50) ఆదివారం మృతి చెందాడు. పోలీసులు, ప్రత్యక్ష సాక్షులు తెలిపిన వివరాల ప్రకారం.. మృతుడు ఆటో నడుపుకుంటూ జీవనం సాగించేవాడు. ప్రయాణికుల కోసం ఆటోను గ్రామంలోని ఒక స్టేజీ వద్ద పెట్టి ఇంటికి బయలుదేరాడు. వెల్గటూర్ నుంచి కరీంనగర్ వైపు వెళ్తున్న కారు (ఏపీ 40 ఏఎన్7609) నడుచుకుంటూ వెళ్తున్న లచ్చయ్యను ఢీకొట్టడంతో తీవ్రగాయాలయ్యాయి. దీంతో క్షతగాత్రుడిని కరీంనగర్ ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతుడి తరుపున ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నామని ఎస్ఐ శ్వేత తెలిపారు.

డెంగ్యూతో బాలిక..

పెగడపల్లి, ఫిబ్రవరి 11: పెగడపల్లి మండలంలోని ఆరవెల్లి గ్రామానికి చెందిన వేముల చతుర్వేద (7) అనే బాలిక ఆదివారం డెంగ్యూ జ్వరంతో మృతి చెందింది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆరవెల్లి గ్రామానికి చెందిన వేముల పవన్ ఎలక్ట్రీషియన్‌గా పని చేసుకుంటూ ఏడాది కాలంగా భార్యా పిల్లలతో కలసి హైదరాబాద్‌లో ఉంటున్నాడు. వారం రోజులుగా చతుర్వేద డెంగ్యూ జ్వరం బారిన పడి హైదరాబాద్‌లో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందింది.


చతుర్వేద (ఫైల్)

అంతర్ జిల్లా దొంగల ముఠా అరెస్టు


నిందితుల నుంచి స్వాధీనం చేసుకున్న వాహనాలు

మానకొండూర్, ఫిబ్రవరి 11: అంతర్ జిల్లా దొంగల ముఠాను ఆదివారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ రాజ్‌కుమార్ తెలిపారు. పోలీసుల అదుపులో అంతర్ జిల్లా దొంగల ముఠా అనే శీర్షికన 'ఆంధ్రజ్యోతి'లో ఆదివారం ప్రచురితమైంది. సీఐ తెలిపిన వివరాల ప్రకారం.. మానకొండూర్‌లోని సదాశివపల్లి వద్ద శనివారం రాత్రి పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. ఆ సమయంలో ఓ కారు (టీఎస్ 21డి 7715)లో ఇద్దరు దాని వెనకాల స్కూటీపై ఒక్కరు వస్తుండగా వాహనాలను పోలీసులు నిలిపివేశారు. వాహనాలను తనిఖీ చేయగా అందులో ఇన్వర్టర్, ఉడెన్ టేబుల్, రాగి వైరు కట్టతో పాటు స్కూటీపై టేబుల్ ఫ్యాను ఉండడంతో పోలీసులు వారిని అదుపులోకి తీసుకుని విచారించారు. ఈ విచారణలో మానకొండూర్‌కు చెందిన కొండ్ర ఫణీందర్, కరీంనగర్‌లోని సుభాష్‌నగర్‌కు చెందిన నెరువట్ల వెంకటేష్, నెరువట్ల అజయ్, పర్వతం సతీష్ ఒక ముఠాగా ఏర్పడి కరీంనగర్ జిల్లాలోని మానకొండూర్, సైదాపూర్, జమ్మికుంట, హుజురాబాద్, కరీంనగర్‌రూరల్, ఎల్ఎండీతో పాటు పెద్దపల్లి, సిద్దిపేట జిల్లాలోని జూలపల్లి, సుల్తానాబాద్, పెద్దపల్లి పట్టణాలలో విద్యుత్ మోటార్లు, వాటి పరికరాలను దొంగిలించిగా 27 కేసులు నమోదు అయినట్లు తేలింది. దొంగిలించిన వస్తువులను మానకొండూర్‌లోని రాజీవ్‌నగర్ కాలనీకి చెందిన సిరిగిరి వెంకటమ్మ, కరీంనగర్‌లోని అల్కాపురి కాలనీకి చెందిన టేకు మల్లేశం, కోతిరాంపూర్‌కు చెందిన లోకిని లక్ష్మికి విక్రయించారు. కొనుగోలు చేసిన వ్యక్తులతో పాటు ముఠా సభ్యుడు అజయ్‌పై కేసు నమోదు చేశారు. నిందితుల వద్ద ఉన్న కారు, స్కూటీ, రాగివైర్లను స్వాధీనం చేసుకొని ముగ్గురిని రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు. అంతర్ జిల్లా దొంగల ముఠాను పట్టుకునేందుకు కృషి చేసిన మానకొండూర్ సీఐ రాజ్‌కుమార్, సిబ్బందిని కరీంనగర్ పోలీస్ కమిషనర్ అభిషేక్ మొహంతి అభినందించారు.

భక్తురాలి బంగారం చోరీ

వేములవాడ, ఫిబ్రవరి 11: రాజరాజేశ్వరస్వామి దర్శనం కోసం వేముల వాడకు వచ్చిన వరంగల్ జిల్లాకు చెందిన రామక్క అనే 70 సంవత్సరాల వృద్ధురాలిని నమ్మించి బంగారం కాజేసిన సంఘటన ఆదివారం చోటుచేసు కుంది. రాజన్నను దర్శించుకున్న అనంతరం జాతర గ్రౌండ్ వైపు నడ చుకుంటూ వెళ్తున్న వృద్ధురాలిని గమనించిన నిందితుడు మీ గది పక్కనే తాము కూడా ఉన్నామని నమ్మించి ద్విచక్ర వాహనంపై ఎక్కించు కున్నాడు. జగిత్యాల బస్‌స్టాండ్ వైపు తీసుకెళ్లి దాదాపు మూడున్నర తులాల బంగారు గొలుసును లాక్కున్నట్లు పట్టణ సీఐ కరుణాకర్ తెలిపారు. నిందితుడు మెరున్‌కలర్ చెక్స్ ఉన్న షర్టు, ప్యాంటు ధరించి ఉన్నాడని, ఆచూకీ తెలిస్తే తమకు సమాచారం అందించాలని కోరారు. రాజన్న సన్నిధికి వచ్చిన భక్తు లు అపరిచితులతో అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

బీజేపీపై కాంగ్రెస్, బీఆర్ఎస్ కుట్ర

- బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్

చందుర్తి, ఫిబ్రవరి 11: కాంగ్రెస్, బీఆర్ఎస్ కలిసి బీజేపీపై కుట్రలు చేస్తున్నాయని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి కరీంనగర్ పార్లమెంట్ సభ్యుడు బండి సంజయ్ కుమార్ అన్నారు. ప్రజాహిత యాత్రలో భాగం గా ఆదివారం రెండో రోజు చందుర్తి మండలం లింగంపేటలో ప్రారంభ మైంది. కట్టలింగంపేట, మల్యాల, చందుర్తి, రామన్నపేట, తిమ్మాపూర్, ఆశిరెడ్డిపల్లి, నర్సింగాపూర్ గ్రామాల్లో యాత్ర కొనసాగింది. ఆహార భద్రత దినోత్సవం సందర్భంగా కట్టలింగంపేటలో రేషన్ దుకాణంలో బండి సంజయ్ పేదలకు ఉచితంగా బియ్యం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎన్నికలు రాగానే రెండు పార్టీలు ఒక్కటవుతాయని, పైకి మాత్రం తిట్టుకుంటారని అన్నారు. కరీంనగర్‌లో కాంగ్రెస్ ఇప్పటి వరకు అభ్యర్థిని పెట్టలేదని, కేవలం బీఆర్ఎస్‌కు అనుకూలంగా ఉండడానికి చూస్తోందని అన్నారు. మొన్న జరిగిన శాసనసభ ఎన్నికల్లోనూ బీజేపీ, బీఆర్ఎస్ ఒక్కటే అని కాంగ్రెస్ ప్రచారం చేసిందన్నారు. బీజేపీని బదనాం చేయడానికే కుట్ర చేశారన్నారు. బీజేపీ అత్యధిక స్థానాలు గెలవనున్నట్లు సర్వేలు వచ్చాక వాళ్లకి మనసున పడడం లేదన్నారు. తమది బీఆర్ఎస్‌తో పొత్తుపెట్టుకునే మూర్ఖత్వం పార్టీ కాదన్నారు. ఒంటరిగా పోటీ చేస్తున్నామని చెప్పుకునే దమ్ము బీఆర్ఎస్‌కు లేదన్నారు. తాము ఏ పార్టీతో పొత్తు పెట్టుకోబోమనే ప్రజలు గమనించాలన్నారు. గతంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ కలిసి పోటీ చేశాయన్నారు. ఫామ్ హౌస్‌లో ఉంటున్న కేసీఆర్ మళ్లీ కుట్రలు చేస్తున్నారన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కి ఒక్క ఎంపీ సీటు రాదని, తెలంగాణ ప్రజలు బీఆర్ఎస్‌ను ఛీ కొట్టారని అన్నారు. బీఆర్ఎస్ మూడో స్థానంలో ఉంటుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ బడ్జెట్ చూశాక ప్రభుత్వంపై ప్రజలకు విశ్వాసం పోయిందన్నారు. ఈ నెల చివరి వారంలో లేదా మార్చి మొదటి వారంలో ఎన్నికల షెడ్యూల్ వస్తుందని, ఎన్నికల షెడ్యూల్ అడ్డుపెట్టుకొని కాంగ్రెస్ ఇచ్చిన హామీలపై కాలయాపన చేస్తుందని అన్నారు. ప్రధానిగా నరేంద్ర మోదీ లేని దేశాన్ని ఊహించుకోలేమన్నారు. మేడిగడ్డ కుంగడంపై లక్ష కోట్లు ఖర్చు చేసి ప్రజల ధనం వృథా అయితే బీఆర్ఎస్ చిన్న సమస్య అంటోందన్నారు. కాంగ్రెస్ ఎందుకు విచారణకు ఆదేశించడం లేదన్నారు. రాహుల్ గాంధీని దేశ ప్రధానిగా ఊహించుకోవడం కష్టమన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ, బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి చెన్నమనేని వికాస్‌రావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అల్లాడి రమేష్, బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ మార్త సత్తయ్య, ఉపాధ్యక్షుడు సిరికొండ శ్రీనివాస్, నాయకులు పోంచెట్టి రాకేష్, చిర్రం తిరుపతి, కటకం లోకేష్, పెరిక గంగరాజు, ఎర్రం మహేష్, రేగుల మల్లికార్జున్, చింతకుంట గంగాధర్, లోకోజు సతీష్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బండి సంజయ్

మోదీ ప్రభంజనంలో ప్రతిపక్షాల అడ్రస్ గల్లంతు


దుంపెటలో ప్రజలకు నమస్కరిస్తున్న ఎంపీ బండి సంజయ్

కథలాపూర్: రాబోవు పార్లమెంట్ ఎన్నికల్లో నరేంద్ర మోదీ ప్రభంజనం మూడో సారి వీస్తుందని అందులో ప్రతిపక్షాలు కొట్టుకుపోవడం తథ్యమని కరీంనగర్ ఎంపీ, బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్‌కుమార్ పేర్కొన్నారు. ప్రజాహిత యాత్రలో భాగంగా రెండోరోజు మండలంలోని సిరికొండ నుంచి ఆరంభం కాగా విలేకరులతో కాసేపు మాట్లాడారు. లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీతో బీఆర్ఎస్ పొత్తు పెట్టుకుంటుందని కొందరు దుష్ప్రచారం చేస్తున్నారని ఆ పరిస్థితి ఎప్పటికీ తలెత్తదని పేర్కొన్నారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ శకం ముగిసిందని మునిగిపోయిన నావతో సంబంధాలు ఎలా పెట్టుకుంటామని అన్నారు. రాష్ట్ర బడ్జెట్ అధ్వానంగా ఉందని ఆరు గ్యారంటీలకు కావల్సిన వ్యయం, కేటాయించిన నిధులకు భారీ తేడా ఉందన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్‌తో పరిపాలన చేతకాదని ఈ బడ్జెట్ రూపకల్పనతో తేలిపోయిందని విమర్శించారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ దొందు దొందేనని ప్రజలు విసుగెత్తిపో యారని పేర్కొన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో నాయకులు, యువత పకడ్బందీగా పనిచేయడానికి ప్రణాళికలు రూపొందించుకుంటున్నట్లు చెప్పారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ దేశంలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ఆర్థిక అభివృద్ధిలో పురోగమనంకు బాటలు వేసినట్లు చెప్పారు. దేశంలోని ఏ రాష్ట్రంలో నిర్వహించిన సర్వేలైనా బీజేపీ విజయం సాధిస్తుందని చెబుతున్నాయన్నారు. అనంతరం సిరికొండ, దూలూరు, దుంపెట, తాండ్ర్యాల, అంబారిపేట, కలికోట గ్రామాల్లో నిర్వహించిన ప్రజాహిత యాత్రలో చిన్నారులను ఎత్తుకున్నారు. మహిళలు, వృద్ధులకు అభివాదం తెలిపారు. పలు గ్రామాల్లో శివాజీ, రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. సెల్ఫీలు దిగేందుకు యువకులు పోటీపడ్డారు. గ్రామాల్లో ఎంపీకి డీజే చప్పుళ్ళతో ఘన స్వాగతం పలికారు. వాడల్లో తిరుగుతూ నమస్కరించారు. గడిచిన ఐదేళ్ళలో పార్లమెంట్ పరిధిలో చేపట్టిన అభివృద్ధి పనులకు సంబంధించిన ఫ్లెక్సీని ప్రదర్శించారు. కార్యక్రమంలో నియోజకవర్గ నాయకులు చెన్నమనేని వికాస్‌రావు, కిసాన్‌మోర్చా జిల్లా అధ్యక్షుడు కొడిపల్లి గోపాల్‌రెడ్డి, మండల అధ్యక్షుడు కంటె సత్యనారాయణ, మాజీ అధ్యక్షుడు రాచమడుగు వెంకటేశ్వర్‌రావు, బద్రి సత్యం, గాంధారి శ్రీనివాస్, ధన్‌పాల్ సూర్యనారాయణ, ప్రవీణ్, జలంధర్‌రెడ్డి, లక్ష్మీనర్సయ్య తదితరులు ఉన్నారు.

భార్యాభర్తల మధ్య మనస్పర్థలు

- అత్తింటివారిపై భర్త దాడి.. ఆత్మహత్యాయత్నం


గొంతుకోసుకున్న కళాధర్

బోయినపల్లి, ఫిబ్రవరి 11: భార్యభర్తల మధ్య మనస్పర్థలు తలెత్తాయి. భర్త తీరు మారకపోవడంతో భార్య విడాకులు కోరింది. నిరాకరించిన భర్త ఆమె ఇంటికి చేరుకొని చంపుతానంటూ భయభ్రాంతులకు గురిచేసి బ్లేడుతో గొంతు కోసుకొని ఆత్మహత్యకు యత్నించాడు. బోయినిపల్లి మండలం రామన్న పేటగ్రామంలో ఆదివారం చోటు చేసుకున్న సంఘటన వివ రాలు ఇలా ఉన్నాయి. రామన్నపేట గ్రామానికి చెందిన శ్వేతకు ఇల్లంతకుంట మండలం ముస్కానిపేటకు చెందిన సామ కళాధర్‌రెడ్డికి 2021లో వివాహమైంది. ఆరు నెలల అనంతరం కళాధర్ మద్యానికి బానిసయ్యాడు. భార్యశ్వేతను వేధించ సాగాడు. భర్త తీరు మారకపోవడంతో శ్వేత పెద్ద మనుషుల సమక్షంలో నిర్వహించిన పంచాయితీలో విడాకులు కోరింది. ఆదివారం తెల్లవారుజామున కళాధర్ శ్వేత ఇంటికి వచ్చి చంపుతానంటూ భయభ్రాంతులకు గురిచేశాడు. తలుపులు తీయకపోవడంతో కళాధర్ వెంట తెచ్చుకున్న బ్లేడుతో గొంతు కోసుకున్నాడు. వెంటనే గ్రామస్థులు పోలీసులకు సమాచారం అందించారు. ఘటన స్థలానికి చేరుకోని 108 ద్వారా సిరిసిల్ల ఆసుపత్రికి తరలించారు. కళాధర్ హైదరాబాద్‌లోని చంచల్‌గూడ జైలులో విధులు నిర్వర్తిస్తుండడం గమనార్హం. శ్వేత ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మూగజీవాలపైకి దూసుకెళ్లిన లారీ

- 40 గొర్రెలు మృతి

చిగురుమామిడి, ఫిబ్రవరి 11: మండలంలోని చిగురుమామిడి గ్రామపంచాయితీ పరిధిలోని రాజన్నపల్లి వద్ద ఆదివారం గ్రానైట్ లారీ ఢీకొన్న ప్రమాదంలో 40 గొర్రెలు మృతి చెందినట్లు ఎస్సై బండి రాజేశ్ తెలిపారు. చిగురుమామిడికి చెందిన సొదం కనుకయ్య, ముదుకిరి సమ్మయ్య గ్రామ శివారులో గొర్రెలను మేతకు తీసుకెళ్లారు. సాయంత్రం వేళ ఇంటికి తరలిస్తుండగా కరీంనగర్ వైపు వెళుతున్న గ్రానైట్ లారీ(టీఎస్ 02 యూఏ 6438) ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో 40 గొర్రెలు అక్కడికక్కడే మృతి చెందాయి. బాధితుల ఫిర్యాదు మేరకు లారీ డ్రైవర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

రేచపల్లిలో కలకలం..

- పోలీసుల అదుపులో పౌర హక్కుల సంఘం నేత రాజేశం
- నాటకీయ పరిణామాల మధ్య ఛత్తీస్‌గఢ్‌కు తరలింపు
- కిడ్నాపర్లుగా భావించి పోలీసులకు గ్రామస్థుల సమాచారం

అది జగిత్యాల జిల్లా సారంగపూర్ మండలం రేచపల్లికి వెళ్లే రోడ్డు.. ఆదివారం తెల్లవారు జామున ఆ రోడ్డుపై రెండు నంబర్‌ప్లేట్ లేని వాహనాలు కనిపించాయి. ఆ వాహనాల్లో నుంచి దిగిన ఎనిమిది మంది వ్యక్తులు హిందీలో ఏదో మాట్లాడుకుంటున్నారు.. అటువైపు వెళ్లిన బట్టపల్లి గ్రామానికి రైతులు వారిని గమనించి చిన్న పిల్లలను కిడ్నాప్ చేయడానికి వచ్చిన ముఠాగా భావించారు. ఈ విషయాన్ని గ్రామస్థులకు తెలిపారు. వారు వాహనాల్లో వచ్చిన వారిని నిలదీయడంతో తాము ఛత్తీస్‌గఢ్ నుంచి వచ్చిన పోలీసులమని తెలిపారు. దీంతో గ్రామస్థులు సారంగపూర్ పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు అక్కడికి వచ్చి వారితో మాట్లాడి ఛతీస్‌గఢ్ పోలీసులు అని నిర్ధారించుకుని వెళ్లిపోయారు. అనంతరం ఛత్తీస్‌గఢ్ నుంచి వచ్చిన పోలీసులు రేచపల్లికి వెళ్లి పౌరహక్కుల సంఘం నేత పోగుల రాజేశంను అదుపులోకి తీసుకున్నారు. ఈ సంఘటన జిల్లా వ్యాప్తంగా కలకలం రేపింది.

- ఆంధ్రజ్యోతి, జగిత్యాల/ సారంగాపూర్

ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని దంతేవాడ జిల్లా గీదం పోలీస్‌స్టేషన్‌కు సంబంధించిన పోలీసులు సారంగాపూర్ మండలం రేచపల్లికి చెందిన పౌరహక్కుల సంఘం ఉమ్మడి జిల్లా కోశాధికారి రాజేశంను ఆదివారం ఉదయం అదుపులోకి తీసుకున్నారు. దంతేవాడ జిల్లాలోని పోలీస్ స్టేషన్ లో గల ఓ కేసులో విచారణ కోసం తీసుకవెళ్తామని కుటుంబసభ్యులకు తెలియజేశారు. ఇదేమిటని కుటుంబసభ్యులు ప్రశ్నించినప్పటికీ బలవంతంగా రాజేశంను, అతని భార్య మల్లీశ్వరిని వాహనంలో తీసుకెళ్లారు. రేచపల్లి శివారులోకి వెళ్లిన అనంతరం రాజేశం భార్య మల్లీశ్వరిని వాహనం నుం చి దింపివేసి వెళ్లిపోయారు. రాజేశంను గుర్తు తెలియని వ్యక్తులు కిడ్నాప్ చేసి తీసుల్లారని ఆయన మల్లీశ్వరి, కుటుంబ సభ్యు లు అంటున్నారు. ఈ విష యమై సారంగపూర్ ఎస్ఐ తిరుపతి మాట్లాడుతూ రేచపల్లి గ్రామానికి వచ్చి రాజేశంను తీసుకవెళ్లింది ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని దంతేవాడ జిల్లా గీదం పోలీస్ స్టేషన్ అధికారులు, సిబ్బందిగా ధ్రువీకరిం చుకున్నామని తెలిపారు. తీవ్రవాదానికి సంబంధించిన ఓ కేసులో నిందితుడిగా ఉన్న రాజేశంను ఛత్తీస్‌గఢ్ పోలీసులు అరెస్టు చేశారన్నారు.


పోగుల రాజేశం




ఛత్తీస్‌గఢ్ పోలీసులు రేచపల్లికి వచ్చిన నంబరు లేని వాహనం, రాజేశంను ఇంటికి పంపాలని వేడుకుంటున్న భార్య, కుమారుడు

● రాజేశంను వెంటనే విడిచిపెట్టాలి

- రాజేశం భార్య మల్లీశ్వరి, కుమారుడు శ్రీనివాస్

పౌరహక్కుల సంఘం నేత రాజేశంను వెంటనే విడిచిపెట్టాలని ఆయన భార్య మల్లీశ్వరి, కుమారుడు శ్రీనివాస్‌లు కోరుతున్నారు. ఆదివారం జగిత్యాల డీఎస్పీ కార్యాలయానికి వచ్చిన సందర్భంగా వారు విలేకరులతో మాట్లాడారు. రేచపల్లి గ్రామానికి గుర్తు తెలియని వాహనాల్లో వచ్చిన కొందరు వ్యక్తులు బలవంతంగా రాజేశంను తీసుకవెళ్లారన్నారు. విషయాన్ని పోలీసులకు అందించగా ఛత్తీస్‌గఢ్‌కు ఓ కేసు విచారణలో రాజేశంను అక్కడి పోలీసులు తీసుకవెళ్లారని అంటున్నారని, తమకు సమాచారం లేదన్నారు. రాజేశంను వెంటనే విడిచి పెట్టాలని కోరారు.

● రాజేశం కిడ్నాప్‌ను ఖండిస్తున్నాం

- కుమార స్వామి, పౌర హక్కుల సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి

పోగుల రాజేశంను గుర్తు తెలియని వ్యక్తులు కిడ్నాప్ చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని రాష్ట్ర పౌర హక్కుల సంఘం సహాయ కార్యదర్శి మాదన కుమారస్వామి అన్నారు. ఆయన జగిత్యాలలో విలేకరులతో మాట్లాడుతూ స్థానిక పోలీసులకు ఎలాంటి సమాచారం లేకుండా పలువురు వ్యక్తులు ఛత్తీస్‌గఢ్ పోలీసులుగా చెప్పుకుంటూ రాజేశంను తీసుకవెళ్లడం సమంజసం కాదన్నారు. పౌరహక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ గడ్డం లక్ష్మణ్ ఫోన్ ద్వారా ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్‌ను సంప్రదించగా పోలీసులకు ఎలాంటి సమాచారం లేదని చెప్పారని వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం చొరవ తీసుకొని రాజేశంను అక్రమ నిర్బంధం నుంచి వెంటనే విడిపించాలని డిమాండ్ చేశారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా ప్రశ్నించే గొంతుకలుగా ఉన్న పౌర హక్కుల సంఘం కార్యకర్తలు, రచయితలు, జర్నలిస్టులు, మేధావులను కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం, ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వాలు అక్రమ అరెస్టులు, నిర్బంధాలు చేస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో పౌర హక్కుల సంఘం ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఉపాధ్యక్షురాలు పుల్ల సుచరిత, ఉపాధ్యక్షుడు నార వినోద్, సహాయ కార్యదర్శి గడ్డం సంజీవ్ కుమార్, కార్యవర్గ సభ్యులు కడ రాజన్న, మోటపలుకుల వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

ధర్మారంలో మహిళ ఆత్మహత్య

ధర్మారం, ఫిబ్రవరి 11: మండల కేంద్రానికి చెందని గోల్కొండ రాజేశ్వరి(37) తన రేకుల షెడ్డులో శనివారం రాత్రి ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. కొన్ని సంవత్సరాల నుంచి ఆమె మూర్ఛవ్యాధితో బాధపడుతోంది. ఈక్రమంలో ఆమె జీవితంపై విరక్తి చెంది తన రేకుల షెడ్డులో శనివారం రాత్రి ఉరేసుకుని ఆత్మహత్యకు చేసుకుంది. మృతురాలి భర్త రాజేశం జీవనోపాధి కోసం దుబాయ్‌లో ఉన్నాడు. మృతురాలికి కుమార్తె, కుమారుడు ఉన్నారు. తల్లి నర్ర వెంకటమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆదివారం కేసు నమోదు చేసినట్టు ఎస్సై 2 ఎస్ అశ్విని తెలిపారు.

ఆరెపల్లిలో చోరీ

వేములవాడ టౌన్, ఫిబ్రవరి 11: వేములవాడ మండలం ఆరెపల్లికి చెందిన శ్రీనివాస్ ఇంట్లో శనివారం అర్ధరాత్రి చోరీ జరిగింది. గ్రామానికి చెందిన శ్రీనివాస్ ఉపాధి నిమిత్తం దుబాయి వెళ్లాడు. భార్య బంధువుల ఇంట్లో నిద్రించింది. శనివారం ఇంట్లోకి చొరబడిన దొంగలు బీరువా తాళం పగలగొట్టి ఇంట్లోని రూ. లక్ష నగదుతోపాటు, రెండు తులాల బంగారం ఎత్తుకెళ్లారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

జనసంద్రంగా మారిన వేములవాడ


స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు

వేములవాడ, ఫిబ్రవరి 11: వేములవాడ రాజరాజేశ్వర స్వామివారి దేవస్థానం ఆదివారం అశేష భక్తజనంతో కిక్కిరిసిపోయింది. మేడారం సమ్మక్క సారలమ్మ జాతరకు వెళ్లడానికి ముందు రాజరాజేశ్వర స్వామి వారిని దర్శించుకునే ఆనవాయితీ ప్రకారం వేలాది మంది భక్తులు తరలివస్తుండడంతో రాజన్న క్షేత్రం భక్తజన సంద్రంగా మారింది. ఈ సందర్భంగా వారు ఆలయ కల్యాణ కట్టలో తలనీలాలు సమర్పించి ధర్మగుండంలో పవిత్ర స్నానాలు ఆచరించారు. అనంతరం సర్వదర్శనం, శీఘ్ర దర్శనం క్యూలైన్ల మీదుగా ఆలయంలోకి చేరుకొని రాజరాజేశ్వర స్వామివారిని దర్శించుకున్నారు. భక్తుల రద్దీ అధికంగా ఉన్న కారణంగా గర్భాలయ ప్రవేశం నిలిపివేసి స్వామివారి దర్శనం త్వరితగతిన సాగే విధంగా ఆలయ అధికారులు చర్యలు తీసుకున్నారు. దీంతో భక్తులు నందీశ్వరుడి వద్ద నుంచి స్వామివారిని దర్శించుకున్నారు. గర్భాలయంలో అభిషేకం, అన్నపూజ నిలిపివేయడంతో క్యూ లైన్లు వేగంగా కదిలాయి. స్వామివారికి ప్రీతిపాత్రమైన కోడెమొక్కు చెల్లించుకునేందుకు భక్తులు గంటల కొద్దీ నిరీక్షించాల్సి వచ్చింది. కోడె మొక్కు క్యూలైన్ పార్కింగ్ స్థలం వరకు సాగడంతో మొక్కు చెల్లింపునకు సుమారు నాలుగు నుంచి ఐదు గంటల పైగా సమయం అవసరమైంది. భక్తుల వాహనాలతో గుడి చెరువు పార్కింగ్ ప్రదేశం పూర్తిగా నిండిపోయింది. బద్ది పోచమ్మ ఆలయంలో భక్తుల రద్దీ కొనసాగింది. భారీ సంఖ్యలో భక్తులు బద్ది పోచమ్మ అమ్మవారికి బోనం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. అనుబంధ ఆలయమైన భీమేశ్వరాలయంలోనూ భక్తుల రద్దీ కొనసాగింది. ఈ సందర్భంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ అధికారులు తగిన ఏర్పాట్లు చేశారు.


క్యూలైన్‌లో బారులుదీరిన భక్తులు

నర్సింహులపల్లిలో ఆలయాల ప్రతిష్ఠ

ధర్మారం, ఫిబ్రవరి11 : మండలంలోని నర్సింహులపల్లిలో ఆదివారం శ్రీకోదండ రామాలయం, శివాలయం ప్రతిష్ఠ మహోత్సవంలో మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ పాల్గొని పూజలు చేశారు. కార్యక్రమంలో జిల్లా సహకార సంఘాల చైర్మన్ ముత్యాల బలరాంరెడ్డి, మండల మాజీ సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు పూస్కూరి జితెందర్‌రావు, బీఆర్ఎస్ మండల అధికార ప్రతినిధి గుర్రం మోహన్ రెడ్డి, స్థానిక బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



సమావేశమైన పూర్వ విద్యార్థులు

కోల్‌సిటీటౌన్, ఫిబ్రవరి 11: పూర్వ విద్యార్థులంతా ఒకేచోట చేరి గురువులను సన్మానించి సరదాగా ఆటలు,పాటల్లో మునిగిపోయారు. గోదావరిఖని రమేష్‌నగర్‌లోని వాసవ్య విద్యాలయం 2002-03 10వ తరగతికి చెందినపూర్వ విద్యార్థులంతా ఆదివారం ఒకే చోట చేరి సమ్మేళనం నిర్వహించారు. ఆనాటి ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో దాసరి రజిత, జొన్నల సురేష్, సతీష్, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

అంత్యక్రియలకు ఆర్థిక సహాయం

రామగిరి, ఫిబ్రవరి 11: మండలంలోని కల్వచర్ల గ్రామపంచాయతీ పరిధిలోని ప్రశాంత్‌నగర్‌లో చెందిన నిరుపేద వ్యవసాయ కూలీ హనుమంతుల సుబ్బారావు అనారోగ్యంతో మృతిచెందగా అంత్యక్రియలకు సింగరేణి ఉద్యోగి రేండ్ల కుమారస్వామి రూ.5వేల ఆర్థిక సహాయం అందజేశారు. దశదినకర్మ ఖర్చులను అందిస్తానని బంధువులకు భరోసా కల్పించారు.

కార్మిక చట్టాలను అమలుచేయాలి

సుల్తానాబాద్, ఫిబ్రవరి 11: గతంలో ఉన్న విధంగా కార్మిక చట్టాలను యథావిధిగా అమలు చేయాలని, కనీస వేతనం నెలకు ఇరవై వేల రూపాయలుగా నిర్ణయించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ముత్యంరావు డిమాండ్ చేశారు. మండల రైస్‌మిల్స్ ఆపరేటర్ల సంఘం వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈనెల 16న సమ్మె గురించి కార్మికులకు వివరించారు. ఆపరేటర్లంతా కలిసి పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఆపరేటర్ల సంఘం అధ్యక్షుడు తాండ్ర అంజయ్యను మరోసారి అధ్యక్షుడిగా ఎన్నుకున్నారు. నూతన కార్యవర్గాన్ని ఏర్పాటు చేసుకున్నారు. కార్యదర్శిగా నౌండ్ల బ్రహ్మచారి, ఉపాధ్యక్షులుగా బండారి తిరుపతి, రవీందర్, విలాస్, బండారి రమేష్, సదయ్య కోశాధికారిగా పూసాల సంపత్, కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు.

ఎస్సైల బదిలీ

ఓదెల, జూలపల్లి, ఫిబ్రవరి 11 : ఓదెల మండలంలోని పొత్కపల్లి ఎస్సై శ్రీధర్ జూలపల్లి పోలీస్‌స్టేషన్‌కు బదిలీ అయ్యారు. సుల్తానాబాద్‌లో విధులు నిర్వహిస్తున్న ఎస్ఐ-2 అశోక్‌రెడ్డిని పొత్కపల్లి ఎస్‌హెచ్‌వోగా నియమించారు. జూలపల్లి ఎస్సై వెంకటకృష్ణను కమిషనరేట్‌కు బదిలీ చేశారు. ఈ మేరకు ఐజీ తరుణ్ జోషి ఉత్తర్వులు జారీ చేశారు.

ఎంపీడీవోల బదిలీ

పెద్దపల్లి రూరల్, ఫిబ్రవరి 11: పెద్దపల్లి ఎంపీడీవోగా సుమారు ఐదేళ్లుగా విధులు నిర్వహించిన రాజును ములుగు జిల్లాకు బదిలీ చేసినట్లు రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ అధికారులు పేర్కొన్నారు. గత కొన్నేళ్లుగా పెద్దపల్లి మండల అధికారిగా విధులు నిర్వహిస్తుండటంతో పార్లమెంట్ ఎన్నికల దృష్ట్యా ఎంపీడీవోల బదిలీ ప్రక్రియ కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో పెద్దపల్లి ఎంపీడీవో రాజును ములుగు జిల్లాకు బదిలీ చేశారు.

జూలపల్లి, ఫిబ్రవరి 11: జూలపల్లి ఎంపీడీవో ఆర్.వేణుగోపాల్‌రావును సాధారణ బదిలీల్లో భాగంగా కరీంనగర్ జిల్లాకు బదిలీ చేస్తూ ప్రభుత్వం ఆదివారం ఉత్తర్వులు జారిచేశారు. ఎంపీడీవోగా వేనుగోపాల్‌రావు ఐదు సంవత్సరాల కాలంగా జూలపల్లిలో విధులను నిర్వహిస్తున్నారు.

సమ్మక్క జాతర రోడ్డు పనులు ప్రారంభం

కాల్వశ్రీరాంపూర్, ఫిబ్రవరి 11: మండలం కేంద్రంలోని మీర్జంపేటలో జరిగే సమ్మక్క జాతర పనులను రోడ్డుకు మొరం పోయించి చదు ను చేస్తున్నారు. ఎమ్మెల్యే చింతకుంట విజయరమణరావు చొరవతో కమాన్ నుంచి జాతర వరకు పనులు చేపడుతున్నట్టు మాజీ ఎంపీటీసీ పోషాల సదానందం తెలిపారు.

వన దేవతలకు 'బంగారం' మొక్కులు

- మహా జాతర కోసం బెల్లానికి పెరిగిన డిమాండ్ - జాతర మాటున గుడుంబా, బెల్లం విక్రయాలు..?

మంథని, ఫిబ్రవరి 11: వన దేవతలైన మేడారం శ్రీసమ్మక్క-సారలమ్మలకు నిలువెత్తు బంగారాన్ని(బెల్లం) భక్తజనం మహానైవేద్యంగా సమర్పించుకుంటున్నారు. రెండేళ్లకోమారు మేడారంలో జరిగే మహాజన జాతర నేపథ్యంలో తమ కోర్కెలు తీరిన భక్తులు వన దేవతలకు తమ నిలువెత్తు బంగారాన్ని(బెల్లం) భక్తిశ్రద్ధలతో సమర్పించి మొక్కులు చెల్లించుకుంటున్నారు. కోర్కె తీరిన భక్తులు కిరాణ షాపుల వద్ద వెళ్లి తల్లులకు తమ, కుటుంబ సభ్యుల ఎత్తు బంగారాన్ని జోకించుకుంటున్నారు. ఈ బంగారాన్ని కొంతమంది ఇంటివద్ద, మరికొంత మంది భక్తులు జాతరలో భక్తులకు అమ్మవార్లకు సమర్పించిన అనంతరం భక్తులకు పంపిణీ చేస్తున్నారు. దీంతో ఏటా లక్షలాది మంది భక్త జనం సెంటిమెంట్‌గా వన దేవతలకు ఆనవాయితీగా సమర్పించుకునే మొక్కుల్లో ప్రధానంగా ఉండే బెల్లం(బంగారం) విక్రయాలకు మంథని డివిజన్‌లో మేడారం మహా జాతర నేపథ్యంలో భారీగా డిమాండ్ పెరిగింది. ఈనెల 21, 22, 23,24 తేదీల్లో జరగనున్న మేడారం మహా జాతరకు వెళ్లే భక్తులు ముందస్తుగా తమ ఇంట్లో శ్రీసమ్మక్క-సారక్క తల్లులకు మొక్కులు చెల్లించుకోవడం అనవాయితిగా వస్తోంది. డప్పుల చప్పుళ్ల, మంగళహారతులతో కుటుంబ సభ్యులంతా కిరాణషాపులకు వెళ్లి ఎవరి పేరిట మొక్కు ఉంటే వారెత్తు బెల్లాన్ని జోకిస్తారు. కొనుగోలు చేసిన బెల్లాన్ని సైతం డప్పుల చప్పులు, మంగళహారతులతో ఇంటికి తీసుకవచ్చి అమ్మవార్లకు సమర్పించిన అనంతరం చుట్టుపక్కల వారికి పంపిణీ చేస్తారు. మేడారం జాతర సీజన్ వచ్చిదంటే ఇలా మంథని ప్రాంతంలో బెల్లానికి భలే డిమాండ్ పెరుగుతుంది. కిలోకు రూ.40 నుంచి 45వరకు బెల్లాన్ని షాపుల్లో విక్రయిస్తున్నారు. భక్తుల అవసరాలను దృష్టిలో ఉంచుకొని వ్యాపారులు పెద్ద ఎత్తున బెల్లాన్ని దిగుమతి చేసుకున్నారు. అయితే కొంత మంది మాత్రం దీన్ని ఆసరా చేసుకొని జాతర మాటున గుడుంబా తయారీదారులకు బెల్లాన్ని విక్రయించి సొమ్ము చేసుకొంటున్నట్లు సమాచారం. డివిజన్ సరిహద్దుకు కేవలం 15కిలోమీటర్ల దూరంలోనే మేడారం శ్రీ సమ్మక్క-సారక్క జాతర కొనసాగుతుండటం, కాటారం-మహాముత్తారం మీదుగా సింగారం, కాల్వపల్లి ద్వారా దూర ప్రాంతాల నుంచి ఇప్పటికే నిత్యం వేలాది మంది భక్తులు ఈ రహదారి గుండానే వెళ్తూ బెల్లం కొనుగోళ్లు చేపడతారు. అంతేగాక సమీపంలో మహా వన జాతర జరుగుతున్న ప్రభావంతో వివిధ మండలాల్లో వేలాది భక్తులు మేడారం జాతర కోసం బెల్లం కొనుగోళ్లు చేపడుతారు. దీని కోసం వందలాది టన్నుల బెల్లం అవసరం కావడంతో ఈమేరకు వ్యాపారులు బెల్లాన్ని తెప్పిస్తున్నారు. మరోవైపు గ్రామాల్లో కూడా జాతరను దృష్టిలో ఉంచుకొని గుడుంబా తయారీ కోసం బెల్లాన్ని నిల్వచేసుకుంటున్నారు. జాతర సమయంలో గ్రామాల్లో, మేడారంలో గుడుంబాకు ఉన్న డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకొని కొందరు గుడుంబా తయారీదారులు స్వేచ్ఛగా దొరుకుతున్న బెల్లాన్ని భారీగా నిల్వ చేసుకోవడంతోపాటు గుడుంబా తయారీ కూడా ఎక్కువ చేసే ప్రయత్నాల్లో ఉన్నారు. ఇలాంటి ప్రయత్నాలను అడ్డుకోవడం కోసం ఎక్సైజ్ అధికారులు చర్యలు తీసుకోవాలని భక్తులు కోరుతున్నారు.



అమ్మవార్ల బంగారాన్ని ఇంటి తీసుకెళ్తున్న భక్తులు

సమ్మెకు మద్దతుగా ఇఫ్టూ బైక్ ర్యాలీ



ఖనిలో బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న ఇఫ్టూ నాయకులు



అంతర్గాంలో బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న న్యూడెమోక్రసీ నాయకులు

గోదావరిఖని, ఫిబ్రవరి 11: నరేంద్ర మోదీ అనుసరిస్తున్న కార్మిక, రైతు వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈనెల 16న తలపెట్టిన జాతీయ సమ్మెను విజయవంతం చేయాలని భారత కార్మిక సంఘాల సమాఖ్య(ఐఎఫ్‌టీయూ), అఖిలభారత రైతు కూలీ సంఘం(ఏఐకేఎంఎస్) ఆదివారం గోదావరిఖనిలో బైక్‌ర్యాలీ నిర్వహించాయి. ఈ సందర్భంగా ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కృష్ణ మాట్లాడుతూ మోదీ ప్రభుత్వం ప్రభుత్వరంగ సంస్థలను, సహజ వనరులను కార్పొరేట్‌పరం చేసిందని, పబ్లిక్ సెక్టార్‌ను వాటాల పేరుతో 100శాతం అమ్మేందుకు కుట్ర చేస్తున్నదని ఆరోపించారు. దేశంలోని మౌలిక వనరులను లీజుల పేరుతో ప్రైవేట్ శక్తులకు అప్పగిస్తున్నదని, ఉద్యోగుల కష్టార్జితమైన పీఎఫ్, పెన్షన్ నిధులను ప్రైవేట్ కంపెనీలకు ధారదత్తం చేస్తున్నదని ఆరోపించారు. సింగరేణిలోని నాలుగు బొగ్గు బ్లాకులను వేలం వేయడానికి ప్రయత్నిస్తున్నదని, 44కార్మిక చట్టాలను నాలుగు కోడ్‌లుగా మార్చిందన్నారు. ఈ విధానాలను వ్యతిరేకిస్తూ ఈనెల 16న జరిగే సమ్మెలో కార్మికవర్గం పాల్గొని విజయవంతం చేయాలని ఐ కృష్ణ పిలుపునిచ్చారు. ఈ బైక్ ర్యాలీలో ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు నరేష్, ప్రధాన కార్యదర్శి బీ అశోక్, నాయకులు చిలుక శంకర్, దుర్గయ్య, బుచ్చయ్య, కొమురయ్య, లింగమూర్తి, మొండయ్య, యూసఫ్, రవికుమార్, చంద్రయ్య, రాజయ్య, ఏఐకేఎంఎస్ జిల్లా అధ్యక్షుడు మేరుగు చంద్రయ్య, నాయకులు కొల్లూరి మల్లయ్య, రాజకొమురయ్య, బొంతు ఆనంద్, రామస్వామి, రమేష్, తిరుపతి, బాలకృష్ణ, సతీష్, రాయమల్లు, గుండు రాజయ్య, శంకర్ పాల్గొన్నారు.

బంద్‌ను విజయవంతం చేయండి..

అంతర్గాం, ఫిబ్రవరి 11: కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న రైతు, కార్మిక వ్యతిరేక విధానాలు నిరసిస్తూ ఈనెల 16న తలపెట్టిన గ్రామీణ బంద్‌ను విజయవంతం చేయాలని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ నాయకుడు మేరుగు చంద్రయ్య అన్నారు. ఆదివారం న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో అంతర్గాం మండలకేంద్రం నుంచి జ్యోతినగర్ మీదుగా గోదావరిఖని వరకు బైక్‌ర్యాలీ నిర్వహించి ఈ మేరకు మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ సర్కార్ కార్పొరేట్ సంస్థలకు కొమ్ము కాస్తూ రైతాంగం, కార్మికవర్గానికి నష్టం చేసే చర్యలకు పూనుకుంటుందని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నాలుగు కోడ్‌లైన నల్ల చట్టాలను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. భారత్‌బంద్‌కు రైతులు, కార్మికులు, మేధావులు, ప్రజాస్వామ్యవాదులు మద్దతు తెలిపి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో న్యూడెమోక్రసీ నాయకులు కొల్లూరి మల్లేష్, ఐ కృష్ణ, చిలుక శంకర్, ఈదునూరి నరేష్, బీ అశోక్, డీ బుచ్చయ్య, రాజకొమురయ్య, తిరుపతి పాల్గొన్నారు.

జాతీయ సమ్మెను జయప్రదం చేయండి

- మావోయిస్టు కోల్‌బెల్ట్ కమిటీ కార్యదర్శి ప్రభాత్

గోదావరిఖని, ఫిబ్రవరి 11: కేంద్ర ప్రభుత్వాన్ని నడిపిస్తున్న ఫాసిస్టు మోదీ అనుసరిస్తున్న కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈనెల 16న దేశవ్యాప్తంగా జరుగుతున్న సమ్మెకు భారత కమ్యూనిస్టు పార్టీ(మావోయిస్టు) మద్దతు పలికింది. సమ్మెలో సింగరేణి కార్మికులు, కాంట్రాక్టు కార్మికులు, అసంఘటిత కార్మికులు, ప్రభుత్వఉద్యోగులు పాల్గొనాలని మావోయిస్టు కోల్‌బెల్ట్ కమిటీ కార్యదర్శి ప్రభాత్ పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆదివారం విడుదల చేసిన ఒక ప్రకటనలో ఆయన మోదీ ప్రభుత్వంపై పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. మోదీ మతతత్వపాలన వల్ల దేశ ప్రజానీకానికి, కార్మికవర్గానికి తీవ్ర నష్టం జరిగిందన్నారు. రాజ్యాంగంలో పొందుపరిచిన ప్రగతిశీల అంశాలకు మోదీ పాలనలో ముప్పు వాటిల్లిందని, ప్రజలకు జీవించే హక్కును మోదీ ప్రభుత్వం హరించి వేస్తోందని, మొత్తం దేశ సంపదను కార్పొరేట్ శక్తులకు దోచి పెడుతోందని విమర్శించారు. దశాబ్దాల తరబడి కార్మికవర్గం పోరాటాలు చేసి సాధించుకున్న కార్మిక చట్టాలను కుదిస్తూ పెట్టుబడిదారులకు అనుకూలమైన చట్టాలను బీజేపీ ప్రభుత్వం తీసుకువచ్చిందన్నారు. సంఘ్‌పరివార్, హిందు మతవాద దుర్మార్గపు ఆలోచనలతో కుల,మత వైశమ్యాలను రెచ్చగొడుతూ కార్పొరేట్ శక్తుల ప్రయోజనాలే ధ్యేయంగా దేశభక్తి ముసుగులో మోదీ ప్రభుత్వం ప్రజానీకాన్ని బలిగొంటున్నదని విమర్శించారు. ఆత్మనిర్బర్ భారత్ పేరిట ప్రభుత్వ సంస్థలను మూసివేస్తూ అమ్మివేయడానికి కేంద్ర ప్రభుత్వం కుట్రలు చేస్తుందన్నారు. దేశంలో కొత్త ప్రభుత్వరంగ సంస్థలకు తావు లేకుండా, ఉపాధి కల్పనకు అవకాశం లేకుండా చేస్తూనే ఉన్న ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేటీకరించడమే దేశభక్తిగా, హిందు ధర్మంగా పేర్కొంటున్నారన్నారు. కొన ఊపిరిలో ఉన్న ప్రజాస్వామ్యాన్ని, లౌకికత్వాన్ని, రాజ్యాంగాన్ని పరిరక్షించే లక్ష్యంతో ప్రగతి శీల శక్తులు, రాజకీయ పార్టీలు, ట్రేడ్ యూనియన్లు విభేదాలు విడనాడి మతోన్మాదానికి, కార్పొరేటీకరణకు, ప్రాపంచీకరణకు, ఫాసిస్టు పాలనకు వ్యతిరేకంగా ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వరంగ సంస్థలను, అడవులను కాపాడుకునేందుకు, కార్మిక చట్టాలను పరిరక్షించుకునేందుకు ప్రజలు జీవించే హక్కును హరిస్తున్న మోదీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా కార్మిక, కర్షకవర్గం సిద్ధంకావాలన్నారు. ఆదివాసీలపై దాడులను ఆపివేయాలని, అటవీచట్టాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈనెల 16న జరిగే సమ్మెను అన్ని వర్గాల కార్మికులు, ఉద్యోగులు, సిబ్బంది విజయవంతం చేయాలని ఆయన కోరారు.

వారసంతలో సమస్యల తిష్ఠ

- 'బజార్'లో కనీస సౌకర్యాలు లేక ఇబ్బందులు - పట్టించుకునే వారు కరువు

కమాన్‌పూర్, ఫిబ్రవరి 11: మండలకేంద్రంలో నిర్వహించే బజార్ (వారసంత)లో కనీస సదుపాయాలు లేక సామాన్య ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. గత 40 సంవత్సరాలుగా ప్రతి శుక్రవారం మండలంలోని గ్రామాలు, ఇతర మండలాల నుంచి సైతం చిరు వ్యాపారులు సరుకులను విక్రయించుకునేందుకు వస్తుంటారు. మండల కేంద్రంలోని గాంధీచౌక్ వద్ద ఉదయం నుంచి పొద్దుపోయే వరకు వ్యాపారం కొనసాగుతుంది. ఈ బజార్ సమీపంలోనే ఆదివరాహస్వామి ఆలయం ఉండటంతో మరింత రద్దీగా ఉంటుంది. బజార్‌లో నిత్యావసర సరుకులు కొనుగోలు చేసేందుకు ప్రజలు పెద్దసంఖ్యలో వస్తుంటారు. బజార్‌లో సరైన సదుపాయాలు లేక విక్రయదారులు, వినియోగదారులు ఇబ్బందులు పడుతున్నారు. బజార్ నిర్వహిస్తున్న సమయంలో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతోంది. ఫలితంగా వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు.



కమాన్‌పూర్‌లో వారసంత జరిగే ప్రాంతం

● మంత్రిపై చిరు వ్యాపారుల ఆశలు

మంథని ఎమ్మెల్యేగా గెలిచి మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన దుద్దిళ్ల శ్రీధర్‌బాబు తమ సమస్యలను పరిష్కరిస్తారని చిరువ్యాపారులు కోటి ఆశలు పెట్టుకున్నారు. వినియోగదారులకు అందుబాటులో ఉండేలా మండల కేంద్రంలోని ఆదివరాహస్వామి ఆలయం వైపు వెళ్లే రహదారికి ఇరువైపులా బజార్‌ను ఏర్పాటు చేస్తే ఇబ్బందులు తొలుగుతాయని భావిస్తున్నారు. తమ తాగునీటి వసతి, షెడ్లు, మరుగుదొడ్లు, విద్యుత్‌దీపాలు ఏర్పాటు చేయాలని చిరు వ్యాపారులు కోరుతున్నారు.

● బజార్‌ను మరో చోటికి తరలించాలి..

- ఇనగంటి మురళీధర్‌రావు, కమాన్‌పూర్



ప్రతి శుక్రవారం నిర్వహించే బజార్‌కు ఇతర ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో ప్రజలు వచ్చి సరుకులను కొనుగోలు చేసే సమయంలో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతోంది. ముఖ్యమైన పనులకు వెళ్లే వాహనదారులకు బజార్ నిర్వహణ సమయంలో ఇబ్బందులు తప్పటం లేదు. ప్రజాప్రతినిధులు స్పందించి సకల సదుపాయాలు ఉన్న చోటికి బజార్‌ను తరలించాలి.

● చిరువ్యాపారుల సమస్యలను పరిష్కరించాలి..

- రానవెన లక్ష్మీనారాయణ, కమాన్‌పూర్



చిరువ్యాపారుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలి. ప్రతి శుక్రవారం నిర్వహించే బజార్ ప్రధాన రహదారికి ఆనుకొని, దేవాలయానికి సమీపంలోనే ఉండటంతో ప్రజలు తీవ్రఇబ్బందులు పడుతున్నారు. బజార్‌ను మరోచోటికి తరలించి సౌకర్యాలు కల్పించాలి. ఇప్పటికైనా ప్రభుత్వం వెంటనే స్పందించి చిరు వ్యాపారుల సమస్యలను పరిష్కరించాలని కోరుతున్నాం.



సమస్యలను పరిష్కరించండి : సీఐటీయూ

యైటింక్లయిన్‌కాలనీ, ఫిబ్రవరి 11: ఏళ్ళ తరబడి పరిష్కారం కాని సమస్యలను పరిష్కరించేలా దృష్టి సారించాలని సీఐటీయూ అనుబంధ సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు టీ రాజారెడ్డి ఆర్జీ-2 జీఎంను కోరారు. ఆదివారం ఆర్జీ-2 నాయకులతో కలిసి జీఎంకు వినతిపత్రాన్ని అందజేశారు. ఓసీపీ-3 సర్వే విభాగంలో రెస్ట్ షెల్టర్ నిర్మించాలని, ఈపీ ఆపరేటర్ల గ్రేడ్ సమస్యను పరిష్కరించాలని కోరారు. వీకేపీ గనిలో పనిచేస్తున్న కార్మికుల నుండి సర్ఫేస్‌కు పంపే కార్మికుల్లో 200 మందికి తగ్గకుండా ఎంపిక చేయాలని, కాలనీ నుండి వీకేపీ గనికి వెళ్ళే రోడ్డు మార్గానికి మరమ్మత్తులు చేయించాలని, సీహెచ్‌పీలో దుమ్ము కారణంగా అనారోగ్యం బారిన పడిన జనరల్ మజ్దూర్‌లను ఓసీపీలోని ఇతర విభాగాలకు బదిలీ చేయాలని కోరారు. హెచ్ఈఎంఎం మజ్దూర్‌లను యాక్టింగ్, సీనియార్టీ ప్రకారం ఎంపిక చేసి పారదర్శకంగా ఖాళీలు భర్తీ చేయాలని వినతిపత్రంలో కోరారు.

వినతిపత్రం ఇచ్చిన వారిలో బ్రాంచి ప్రెసిడెంట్ కుంట ప్రవీణ్, నాయకులు అజ్మీర కిషోర్, రాంసాగర్, నాగార్జున్, రాజేందర్, రాజేష్ నాయక్, వినయ్, నరసింహ, శ్రవణ్, మహేష్ తదితరులు ఉన్నారు.

బొగ్గు ఉత్పత్తి లక్ష్య సాధనకు కృషి చేయాలి

యైటింక్లయిన్‌కాలనీ, ఫిబ్రవరి 11: ఆర్జీ-2 ఏరియాకు నిర్దేశించిన బొగ్గు ఉత్పత్తి లక్ష్యాన్ని సాధించేందుకు శ్రమించాలని సింగరేణి డైరెక్టర్(ఆపరేషన్స్) ఎన్వీకే శ్రీనివాస్ పేర్కొన్నారు. ఆదివారం ఓసీపీ-3 ప్రాజెక్టును ఆయన పరిశీలించారు. వ్యూపాయింట్ నుంచి పని స్థలాలను పరిశీలించి ఉత్పత్తి మెరుగుపడేందుకు తీసుకోవాల్సిన చర్యలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా అధికారులకు పలు సూచనలు చేశారు. ఫేజ్-2 ఓబీ తొలగింపు పనులను పరిశీలించిన డైరెక్టర్ ఓబీ అధికారులతో మాట్లాడారు. బొగ్గు ఉత్పత్తికి ఆటంకం ఏర్పడకుండా ఓబీ వెలికితీత పనులు ఎప్పటికప్పుడు పూర్తిచేయాలని సూచించారు. ఆర్థిక సంవత్సరం ముగియడానికి తక్కువ సమయం ఉన్నందున ప్రణాళికా బద్ధంగా, సమన్వయంతో పనిచేయాలని డైరెక్టర్ ప్రాజెక్టు అధికారులకు సూచించారు. డెరెక్టర్ వెంట జీఎం సూర్యనారాయణ, పీవో మధుసూదన్, పీఈ రాజాజీ, సర్వే అధికారి నర్సింగరావు, ఏరియా పర్యావరణ అధికారి సురేష్‌బాబు, ఎస్ఎస్‌వో షరీఫ్ మహమ్మద్ ఉన్నారు.



ప్రాజెక్టును పరిశీలిస్తున్న డైరెక్టర్ శ్రీనివాస్

ఆస్థుల పరిరక్షణలో అప్రమత్తంగా ఉండాలి

సింగరేణి ఆస్తుల పరిరక్షణలో అప్రమత్తంగా ఉండాలని ఆర్జీ-2 సీనియర్ సెక్యూరిటీ ఆఫీసర్ షరీఫ్ మహమ్మద్ పేర్కొన్నారు. ఆదివారం సెక్యూరిటీ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా విధి నిర్వహణలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పలు సూచనలు చేశారు. సెక్యూరిటీ సిబ్బంది తమకు కేటాయించిన పోస్టుల వద్ద కోల్ ట్రాన్స్‌పోర్టు, సీఎస్పీలు, ఓసీపీల వద్ద అప్రమత్తంగా లేకపోతే బొగ్గు రవాణాలో, విలువైన విడిభాగాల తరలింపులో తప్పులు దొర్లే అవకావం ఉంటుందని అన్నారు. బొగ్గు రవాణాలో దొంగతనాలు జరగకుండా జాగ్రత్త వహించాలని షరీఫ్ మహమ్మద్ సిబ్బందికి సూచించారు. ఈసమావేశంలో సీనియర్ ఇన్‌స్పెక్టర్ లక్ష్మరాజం, జూనియర్ ఇన్‌స్పెక్టర్ యాదగిరితో పాటు సెక్యూరిటీ గార్డులు పాల్గొన్నారు.

బాధితుడికి పరామర్శ

పాలకుర్తి,ఫిబ్రవరి 11: కరీంనగర్ ఆస్పత్రిలో ఆపరేషన్ చేయించుకొని చికిత్స పొందుతున్న గీత కార్మికుడిని ఆదివారం కన్నాల పీఏసీఎస్ చైర్మెన్ బయ్యపు మనోహర్‌రెడ్డి పరామర్శించి వారి కుటుంబానికి మనోధైర్యం కల్పించారు. మండలం పరిధిలోని రాణాపూర్ గ్రామానికి చెందిన నాగుల నారాయణ గత గురువారం ఉదయం కల్లు గీసేందుకు తాటి చెట్టు ఎక్కగా నడుముకు కట్టుకున్న మోకు జారడంతో ప్రమాదవశాత్తు కిందపడి తలకు తీవ్ర గాయాలయ్యాయి. దీంతో చికిత్స కొరకు కరీంనగర్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా అక్కడి వైద్యులు నారాయణకు ఆపరేషన్ చేసి చికిత్స అందిస్తున్నారు.

'మహాలక్ష్మి' సవరణలు త్వరితగతిన పూర్తిచేయాలి

పెద్దపల్లి రూరల్, ఫిబ్రవరి 11: తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయనున్న ఆరు గ్యారంటీ పథకాల్లో భాగంగా మహాలక్ష్మి పథకం దరఖాస్తుల సవరణలు త్వరగా పూర్తిచేయాలని ఎంపీవో సుదర్శన్ అన్నారు. ఆదివారం మండలంలోని అప్పన్నపేటలో ఆన్‌లైన్ నమోదు ప్రక్రియను ఎంపీవో పరిశీలించారు. తప్పిదాలు లేకుండా నమోదుచేయాలని పంచాయతీ అధికారులకు సూచించారు. వెంట పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ ఉన్నారు.

పెద్దపల్లి ఎంపీ టికెట్ మాదిగలకే కేటాయించాలి



శ్రీధర్‌బాబుకు వినతిపత్రం ఇస్తున్న మాదిగ ఐక్యవేదిక నాయకులు

పెద్దపల్లిటౌన్, ఫిబ్రవరి 11: పెద్దపల్లి ఎంపీ స్థానాన్ని మాదిగలకే కేటాయించాలని మాదిగ ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఆదివారం తెలంగాణ రాష్ట్ర ఐటీ, శాసనసభ వ్యవహారాల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, టీఆర్ఎస్ పార్టీ కార్యాలయ ఇన్‌చార్జి శ్రీనివాస్‌రెడ్డిలకు వేరు వేరుగా వినతిపత్రాలు అందజేశారు. పెద్దపల్లి పార్లమెంట్ పరిధిలో మాదిగలు అత్యధిక శాతం ఉన్న నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ, బీజేపీ, టీఆర్ఎస్ పార్టీలు మాదిగలకే కేటాయించాలని కోరారు. వారు సానుకూలంగా స్పందించినట్లు ఐక్యవేదిక నాయకులు పేర్కొన్నారు. కార్యక్రమంలో పల్లె సదానందం కామల్లి ప్రభాకర్ మామిడిపల్లి పాపయ్య కోటగిరి పాపయ్య నాతర ప్రభాకర్ డాక్టర్ శంకర్ కొల్లంపల్లి బాబన్న సంకేనపల్లి లక్ష్మయ్యపాల్గొన్నారు.

కళాకారుడి జ్ఞాపకార్థం బోర్‌వెల్ సౌకర్యం

ఓదెల, ఫిబ్రవరి 11: మండలంలోని గూడెంలో నిర్మిస్తున్న కురుమల ఆరాధ్య దైవమైన బీరన్న ఆలయం వద్ద ఆదివారం ఒగ్గు కథ కళాకారుడు వీరముష్టి సంపత్ జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యులు కుమారుడు నాని, కూతురు స్వీటీ బోర్‌వెల్ సౌకర్యాన్ని ఏర్పాటు చేసేందుకు ముందుకు వచ్చారు.ఈ మేరకు గుడి ఆవరణలో బోరుబావి పనులను కుల పెద్ద వీరముష్టి కొమరయ్య ప్రారంభించారు.

ధ్యాన శిక్షణ కార్యక్రమం ప్రారంభం

మంథని, ఫిబ్రవరి 11: స్థానిక కొమురవెల్లి విజయ్‌కుమార్ నివాసంలో ఏర్పాటు చేసిన పిరమిడ్ ధ్యాన శిక్షణ కార్యక్రమాన్ని శ్రీపాద ట్రస్టు చైర్మన్ దుద్దిళ్ల శ్రీనుబాబు ఆదివారం ప్రారంభించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నేతలు, సాధకులు పాల్గొన్నారు.

వీరాచారికి అవార్డు ప్రదానం



వీరాచారిని సత్కరిస్తున్న సేవా ట్రస్టు ప్రతినిధులు

సుల్తానాబాద్, ఫిబ్రవరి 11: జ్యోతిష్య, వాస్తు రంగంలో విశిష్ట సేవలందించిన సుల్తానాబాద్‌కు చెందిన బ్రహ్మశ్రీ చిలుమోజు వీరనారాయణ చార్యులకు విజయవాడకు చెందిన ఆంధ్రప్రదేశ్ బుక్ ఆఫ్ రికార్డు తెలుగు సంస్కృతీ సాహితీ సేవా ట్రస్ట్ వారు ఆదివారం ఘనంగా సత్కరించి అవార్డు ప్రదానం చేశారు. శ్రీకృష్ణదేవరాయులు, యోగి వేమన జయంతి ఉత్సవాల జాతీయ పురస్కారాల ప్రదానోత్సవ కార్యక్రమాన్ని ఆదివారం విజయవాడలో నిర్వహించారు.

'వలస నేతలకు అడ్డాగా పెద్దపల్లి ఎంపీ స్థానం'

మంథని, ఫిబ్రవరి 11: పెద్దపల్లి ఎంపీ స్థానం వలస నాయకులకు అడ్డగా మారిందని ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్ డాక్టర్ వాసర్ల నతానియేలు అన్నారు. మంథనిలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ఇప్పటివరకు పెద్దపల్లి ఎంపీగా పనిచేసిన అభ్యర్థులు లోక్‌సభ స్థానానికి సంబంధం లేని వారేనని, వీరి వల్ల అభివృద్ధి కుంటుపడటమే కాకుండా, వెనుకబడిందని ఆరోపించారు. లోక్‌సభ నియోజకవర్గంలో నిరుద్యోగం ఎక్కువగా ఉందని, ఇక్కడ వ్యక్తి ఎంపీ అయితే విద్యా వైద్య సాంకేతిక కళాశాలలు స్థాపించుకోవచ్చునని సూచించారు. వచ్చే ఎన్నికల్లో తనను ఆశీర్వదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఈర్ల సదానందం, రామగిరి ప్రసన్నకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా గురుకుల ప్రవేశ పరీక్ష

ధర్మారం,ఫిబ్రవరి11: ధర్మారం మండలం మల్లాపూర్, నంది మేడారం సాంఘిక సవక్షేమ శాఖ గురుకుల విద్యాలయాల్లో ఆదివారం నిర్వహించిన ఐదో తరగతి ప్రవేశ పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి, మల్లాపూర్ బాలకల గురుకుల విద్యాలయం పరీక్ష కేంద్రంలో 415మంది విద్యార్థులకు 391మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 24మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. అదే విధంగా నందిమేడారం బాలికల గురుకుల విద్యాలయం పరీక్ష కేంద్రంలో 384మంది విద్యార్థులకు 367మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 17మంది గైర్హాజయ్యారు. ఈ పరీక్షలు మల్లాపూర్, నందిమేడారం గురుకుల విద్యాలయాల ప్రిన్సిపల్ సీహెచ్ గిరిజ. ఎస్. శైలజ పర్యవేక్షించారు.

కన్యకా పరమేశ్వరి ఆలయంలో ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

మంథని, ఫిబ్రవరి 11: శ్రీవాసవి కన్యకాపరమేశ్వరి ఆలయంలో అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవాన్ని పురస్కరించుకొని భక్తులు ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. దేవాలయంలో 24 గంటల ఏకాహం, భజన కార్యక్రమాలు, లక్ష కాగడ మల్లెలతో అమ్మవారికి పుష్పాభిషేకం, అమ్మవారి ప్రత్యేక అభిషేకం, సాయంత్రం భజన కార్యక్రమంలో అమ్మవారికి 102 గోత్రములతో అగ్నిగుండ ప్రవేశం లాలి, జోల పాటలు పాడి వైభవంగా జరుపుకున్నారు. భక్తులందరి కొత్త ప్రకాష్ దంపతలు కూడా మహా అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

నేత్రాలు సజీవం

కళ్యాణ్‌నగర్, ఫిబ్రవరి 11: మరణించినా ఆయన నేత్రాలు మాత్రం సజీవంగా ఉన్నాయి. గోదావరిఖని పట్టణం హనుమాన్‌నగర్‌కు చెందిన కొయ్యల ఎల్లయ్య అనే మాజీ సింగరేణి ఉద్యోగి ఆదివారం అనారోగ్యంతో మృతి చెందగా ఆయన నేత్రాలను కుటుంబ సభ్యులు దానం చేశారు. సదాశయ ఫౌండేషన్‌కు సమాచారం అందించడంతో ప్రసాద్ ఐబ్యాంక్ ల్యాబ్ టెక్నీషియన్ రాజేంద్రప్రసాద్ ఎల్లయ్య నేత్రాలను సేకరించారు. ఈ కార్యక్రమంలో సదాశయ ఫౌండేషన్ జాతీయ అధ్యక్షులు శ్రావణ్ కుమార్, అధ్యక్షకార్యదర్శులు అన్నపూర్ణ, లింగమూర్తి, చంద్రశేఖర్, కవిత, శశికళ, శారద, కేఎస్ వాసు తదితరులు ఉన్నారు.